సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 10 । నవంబర్ । 2023



మనసున్న మారాజు

రాయచోటిలో చిన్నారుల బాధను చూసి చలించిపోయిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి వారికి వైద్య సాయం అందించి మనసున్న మారాజు అనిపించుకున్నారు. -2లో



తెలుగు సాహిత్యానికి వెలుగునిచ్చిన 'బ్రౌన్'

తెలుగు సాహిత్యానికి మరింత వెలుగు తెచ్చిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 225వ జయంతి శుక్రవారం నిర్వహించనున్నారు. -2లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.340
రెండోరకం	రూ.200	రూ.268



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 255 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	340	465
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1,205,540 కిలోలు

పులకించిన పులివెందుల



పులివెందులలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కరచాలనం చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్న జనం



పులివెందులలోని శ్రీకృష్ణ ఆలయంలో సీఎం వైఎస్ జగన్

- సీఎం వైఎస్ జగన్ రాకతో చిరు జల్లులు
- ఉక్కపోత నుంచి ఒక్కమారుగా చల్లటి వాతావరణం
- పేరుపేరునా పలుకరించి, ఆప్యాయతతో అనునయించి..
- అభిమాన నేతకు పులివెందుల, ఇడుపులపాయలో ఘనస్వాగతం

సాక్షి ప్రతినిధి, కడప: ఓ వైపు పరుగులు పెడుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, మరోవైపు అభిమాన నాయకుడు పులివెందుల ముద్దుబిడ్డ పర్యటన అక్కడి ప్రజానీకంలో ఆతృత కన్పిస్తోంది. మిట్ట మధ్యాహ్నం కావడంతో అంతే ఎండ వేడిమి ఉంది. అంతలోనే ఒక్కమారుగా మేఘాలు తెరపైకి వచ్చి మబ్బులు కమ్మాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హెలికాప్టర్ పులివెందులలో ల్యాండ్ అవుతోంది, చిరు జల్లులు ప్రారంభమయ్యాయి. పులివెందులలో శ్రీకృష్ణ దేవాలయం ప్రారంభోత్సం చేపట్టిన కొద్దిసేపటికి జల్లులు కాస్తా, వర్షమైంది. చల్లటి వాతావరణం పట్టణమంతా ఆవిష్కరితమైంది. ఒక్కమాటలో చెప్పాలంటే పులివెందుల పులకించింది.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం మధ్యాహ్నం పులివెందుల చేరుకున్నారు. తొలిరోజు రూ. 64.54 కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టారు. అత్యంత రమణీయంగా తీర్చిదిద్దిన శిల్పారామం ప్రారంభించారు. శిల్పారామంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలియ తిరిగారు. అక్కడ పనిచేస్తున్న స్థానిక సిబ్బందిని ఆప్యాయంగా పలుకరించారు. ఈసందర్భంగా పలు ప్రదర్శనలు తిలకించిన సిఎం ప్రదర్శనకారులను అభినందించారు. దేశంలో అత్యంత ప్రాచుర్యం కలిగిన శ్రీస్వామినారాయణ అంతర్జాతీయ గురుకుల విద్యాపీఠం ఏర్పాటుకు సీఎం భూమి పూజ చేశారు. ఆ తర్వాత నూతనంగా ఏర్పాటు చేసిన హార్టికల్చర్ కళాశాలను ప్రారంభించారు. వెరసి గురువారం పులివెందులలో పండుగ వాతావరణం ఆవిష్కరితమైంది.



చిన్నారిని ఎత్తుకుని లాలిస్తున్న సీఎం

సీవీ సుబ్బారెడ్డి కుటుంబానికి పరామర్శ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సమీప బంధువు దివంగత సీవీ సుబ్బారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో సీవీ సుబ్బారెడ్డి మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆ కుటంబ సభ్యులను కలిసి సీఎం వైఎస్ జగన్, వైఎస్ భారతిరెడ్డి దంపతులు పరామర్శించారు. ఇంటి పెద్ద కోల్పోయినప్పుడు గుండె నిబ్బరంతో ఉండాలని సుబ్బారెడ్డి సతీమణిని ఓదార్చారు. పులివెందులలో చేపట్టిన పలు కార్యక్రమాల్లో అనేక మంది సుపరిచితులు కన్పించగా, అందర్నీ పేరు పేరునా పలకరించారు. ఆప్యాయతతో ఆయా నాయకులు, అనుచరుల్ని అనునయించారు. దగ్గరకు తీసుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాయచోటి: రాయచోటిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ముందుగా కడప విమానాశ్రయం నుంచి అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని సుద్దలవాండ్లపల్లె రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు మధ్యాహ్నం 12.03 గంటలకు సీఎం చేరుకున్నారు. జననేతకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ పీవీ. మిథున్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ కృష్ణారావు, ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ప్రభుత్వ విప్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాయచోటి, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్‌బాషా, చింతల రామచంద్రారెడ్డి, ద్వారకనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జేసీ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, రాయ చోటి ఆర్డీఓ రంగస్వామి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి తదితరులు ఘనస్వాగతం పలికారు.

- హెలీప్యాడ్ నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా వివాహ కార్యక్రమాలకు వెళ్లారు. ముందుగా స్థానిక అభి ఫంక్షన్ హాల్‌లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానమ్ కుమారుడి వలిమా వేడుకకు ఆయన హాజరయ్యారు. వధువు మయానామ జఫర్ అలీఖాన్, కోడలు నజ్మాలను ఆశీర్వదించారు. అనంతరం రాజధాని ఫంక్షన్ హాల్‌లో జరిగిన వేడుకలో మాజీ ఎంపీపీ జీఎండీ.రఫీ కుటుంబ సభ్యుల వివాహానికి హాజరై వరుడు మహమ్మద్ నిహాజ్, వధువు నూర్ ఇ చష్మిలను ఆశీర్వదించారు.

చిన్నారిని లాలించిన సీఎం: శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం కుమారుడి వివాహ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఓ చిన్నారిని ఎత్తుకుని ఆప్యాయంగా పలకరించడం ఆకట్టుకుంది.

సీఎంకు ఘన స్వాగతం

రెండు రోజుల పర్యటనలో భాగంగా జిల్లాకు చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప ఎయిర్‌పోర్టు, పులివెందుల, ఇడుపులపాయలలో ఘనస్వాగతం లభించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పి రామసుబ్బారెడ్డి, సి రామచంద్రయ్య, రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, ఎమ్మెల్యేలు డాక్టర్ సుధా, డాక్టర్ సుధీర్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప మేయర్ కె సురేష్‌బాబు, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి కలెక్టర్ విజయరామరాజు, కర్నూల్ డీఐజీ సెంథిల్‌కుమార్, వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్దార్థకౌశల్, వైఎస్ మనోహరరెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ మాసీమ బాబు, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నప్ప తదితరులు ముఖ్యమంత్రికి సాదరంగా ఆహ్వానం పలికారు. ఇడుపులపాయ హెలిప్యాడ్ నుంచి వాహనంలో సాయంత్రం గెస్ట్ హౌస్ కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు శుక్రవారం (10.11.23) ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం ఇడుపులపాయ నెమళ్ల పార్కులో వేముల ప్రజాప్రతినిధులతో జరిగే రివ్యూ మీటింగ్ లో పాల్గొననున్నారు.

ఇడుపులపాయలో బస

వేంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల భాకరాపురం హెలీప్యాడ్ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.50గంటలకు ఇడుపులపాయకు చేరుకున్నారు. ముఖ్యమంత్రితోపాటు ఇడుపులపాయ హెలీప్యాడ్‌కు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజులు చేరుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయ హెలీప్యాడ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుల వద్ద నుంచి, అక్కడ ఉన్న వారి నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం వాహనంలో సాయంత్రం గెస్టహౌస్‌కు చేరుకున్నారు.



పులివెందులలో శ్రీకృష్ణాలయంలో పూజల్లో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్



ఆదిత్య బిర్లా గార్మెంట్స్‌లో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న సీఎం



సీవీ సుబ్బారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీఎం వైఎస్ జగన్ దంపతులు



పులివెందులలోని శిల్పారామం శిలాఫలకం వద్ద సీఎం వైఎస్ జగన్ తదితరులు

న్యూస్‌రీల్

పరీక్ష రుసుం చెల్లింపు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: 2024 మార్చిలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల రాష్ట్ర డైరెక్టర్ దేవానందరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రెగ్యులర్, ఫెయిలైన అభ్యర్థులు గమనించి రుసుము సకాలంలో చెల్లించాలన్నారు.

నేడు కౌన్సెలింగ్

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఈ పోస్టులకు ఎంపికైన వారికి శుక్రవారం కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ జీ రత్నకుమారి తెలిపారు. మొత్తం 94 పోస్టులకు కడపలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం (ఐటీఐ సర్కిల్‌కు సమీపంలోని శాస్త్రినగర్)లోని మీటింగ్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు చెప్పారు. స్టాఫ్ నర్స్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

గ్రామ కార్యదర్శులకు తాఖీదులు

సిద్దవటం: మండలంలోని తొమ్మిది మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఆరోగ్యశ్రీ, హౌసింగ్ యాప్ డౌన్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం చేయడంతో.. జేసీ ఆదేశాల మేరకు నోటీసులు పంపినట్లు ఎంపీడీఓ తెలిపారు.

సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ

కడప కార్పొరేషన్: రాష్ట్రంలోని అన్ని పట్టణాలకు ప్రత్యేక నిధులు కేటాయించి సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసేందుకు పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా.ఆదిమూలపు సురేష్ అన్నారు. కడప కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఉదయం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.

మహమ్మద్‌ఖాన్‌కు ఉర్దూరతన్ అవార్డు

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు పఠాన్ మహమ్మద్ ఖాన్‌కు జాతీయ స్థాయి ఉర్దూ రతన్ అవార్డు అందుకున్నారు. మహమ్మద్ ఇక్బాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం నంద్యాల జిల్లా కేంద్రంలో కార్వాన్-ఏ-ఉర్దూ సంస్థ ఆధ్వర్యంలో ఉర్దూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేసిన మహమ్మద్‌ఖాన్‌కు నంద్యాల మున్సిపల్ చైర్మన్ మహబూబ్‌బీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ మహమ్మద్ నౌమాన్‌లు ఉర్దూ రతన్ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సాహితీ వేత్తలు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న మహమ్మద్‌ఖాన్

ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

రాజంపేట టౌన్: రాజంపేట బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై గురువారం అవగాహన కల్పించారు. ఉపాధ్యాయురాలు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో మాక్ పోలింగ్(మాదిరి ఎన్నికలు) నిర్వహించారు. విద్యార్థి ప్రతినిధి పదవికి 14 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఐదుగురు ఉపసంహరించుకోగా తొమ్మిది మంది బరిలో నిలిచారు. ఎంఈఓలతో పాటు ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించారు. 462 ఓట్లకుగానూ 320 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 102 ఓట్లు సాధించిన తొమ్మిదో తరగతి విద్యార్థిని శ్రీహిత గెలుపొందారు. ఎన్నికలకు ఎన్నికల అధికారులు, ఏజెంట్లుగా విద్యార్థులే విధులు నిర్వర్తించారు. ఎంఈఓ సుబ్బరాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో ఎన్నికల పట్ల అవగాహన పెంచుతాయన్నారు. హెచ్‌ఎం జయలక్ష్మీ పాల్గొన్నారు.



ఓటు వేస్తున్న విద్యార్థిని

జలకళ పథకం రైతులకు వరం



బోర్లలో వస్తున్న నీటిని పరిశీలిస్తున్న వెంకటరామమునిరెడ్డి

వాటర్ షెడ్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటరామమునిరెడ్డి

వేముల: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ జలకళ పథకం నిరుపేద రైతులకు వరమని వాటర్ షెడ్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటరామమునిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెండ్లూరు గ్రామంలో సన్నచిన్నకారు రైతులకు వైఎస్సార్ జలకళ పథకం ద్వారా వేసిన వ్యవసాయ బోర్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఉచితంగా వ్యవసాయ బోరు వేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ జలకళ పథకం ఎంతమేరకు ఉపయోగపడుతుంది.. ఏయే పంటలు సాగు చేస్తున్నారు.. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ శశిధర్‌రెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ సాగర్ రెడ్డి, ఏపీడీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

తొండూరు: మండలంలోని సంతకొవ్వూరు ప్రాజెక్టు, గోటూరు మైక్రో వాటర్ షెడ్ పనులను రాష్ట్ర డైరెక్టర్ వెంకటరామమునిరెడ్డి పరిశీలించారు. గురువారం ఉదయం సంతకొవ్వూరు, గోటూరు గ్రామాలకు వెళ్లి అక్కడ జరుగుతున్నటువంటి వాటర్‌షెడ్, అమృతసరోవర్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిర్మించిన చెరువు వల్ల వ్యవసాయానికి మాకు అనుకూలంగా ఉందని రైతులు తెలిపారు.

నేడు సామాజిక సాధికార బస్సు యాత్ర

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించనున్న ప్రజాప్రతినిధులు
- రెండు మండలాల్లో పండుగ వాతావరణం
- భారీగా తరలిరానున్న శ్రేణులు

బి.కొత్తకోట: 'ఈ ప్రభుత్వం ద్వారా మీ కుటుంబానికి మేలు జరిగి వుంటేనే మీ బిడ్డకు అండగా నిలవండి' ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సభల్లో తరచూ చెప్పే మాటలివి. ప్రజలకు మేలు చేయడంవల్లే ఇంత గట్టిగా చెప్పడం సాధ్యమవుతుంది. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు వివిధ పథకాల ద్వారా కలిగిన లబ్ధి, అండగా నిలిచిన తీరును వివరించేందుకు అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల్లో శుక్రవారం సామాజిక సాధికారత బస్సు యాత్ర నిర్వహించనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, స్థానిక నాయకులు సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించనున్నారు.

తొలి అడుగో సంక్షేమం

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ముందు వరకు రాజకీయ పార్టీల్లో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలు పార్టీలకు పల్లకీ మోసే బోయీలుగా ఉండేవారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్‌ఐలు

ప్రభుత్వ పాలనలో రాజకీయ అధికారం, సంక్షేమ పథకాల్లో ఆర్థిక భాగస్వామ్యం అరుదుగా ఉండేది. ఈ పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సమూలంగా మార్చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సమున్నత స్థానం కల్పించింది. ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్ల నుంచే పేదలకు ఆర్థిక చేయూత ఇచ్చే పథకాలకు అడుగులు పడ్డాయి. గతంలో మాదిరి సిఫార్సుల ప్రమేయం కనిపించకుండా చేశారు. అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలు వారి గడప వద్దకే చేరగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రభుత్వ పదవులను కట్టబెట్టి రాజ్యాధికారంలో సామాజిక న్యాయం పాటించింది.

శ్రేణుల్లో నూతనోత్సాహం

సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పెద్దతిప్పసముద్రం సమీపంలోని కళ్యాణమండపంలో తొలుత యాత్రకు హాజరైన ప్రజా ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహిస్తారు. తర్వాత యాత్ర ప్రారంభించి పెద్దతిప్పసముద్రం మీదుగా కుమ్మరపల్లె, మద్దయ్యగారిపల్లె, కమ్మోరుపల్లె, పులికల్లు మీదుగా ములకలచెరువు చేరుకుంటుంది. అక్కడి మూడు రోడ్ల కూడలిలో నిర్వహించే బహిరంగ సభలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రసంగిస్తారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశారు. ఈ యాత్రకు అడుగడుగునా ఘన స్వాగతం పలికేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో సిద్ధమయ్యారు. యాత్ర నిర్వహణ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై గురువారం ములకలచెరువులో మదనపల్లె డీఎస్పీ కేశప్ప, సిఐలు శివాంజనేయులు, మధు, ఎస్ఐ పరిశీలించారు. యాత్ర సాగే ప్రాంతాల్లో ప్లెక్సీలు, తోరణాలు భారీ సంఖ్యలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని 102 పంచాయతీలు, బి.కొత్తకోట నగర పంచాయతీ నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకొంటున్నారు.

న్యాయ సేవలను వినియోగించుకోవాలి



న్యాయ సేవా దినోత్సవ ర్యాలీలో న్యాయమూర్తులు

మదనపల్లె: బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలదించేందుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ తీసుకు వచ్చినట్లు రెండో అదనపు జిల్లా జడ్జి బి.అబ్రహాం అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లు నాయక్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శిరీష్, ఒకటో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జీ.సి.ఆసిఫా సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

స్పెల్'బీ'కి చక్కటి స్పందన

వైవీయూ : సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ 'బి' కాంపిటీషన్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. గురువారం కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్, జీఆర్‌టీ జీవీకే స్కూల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, జీఎంఆర్ హైస్కూల్, సింహాద్రిపురం మండలం గురజాలలోని నేతాజీ హైస్కూల్‌లో నిర్వహించిన స్పెల్ 'బి' కాంపిటీషన్‌కు అపూర్వ స్పందన లభించింది. కాంపిటీషన్‌లో కేటగిరీ-1లో 1,2 తరగతుల విద్యార్థులు, కేటగిరీ-2లో 3,4 తరగతుల విద్యార్థులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతుల విద్యార్థులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్‌కు ఆయా పాఠశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై తమ ప్రతిభను పరీక్షించుకున్నారు. ఆంగ్లంపై మక్కువ పెంచేలా, ఆసక్తి కలిగించేలా ప్రయత్నం చేస్తున్న 'సాక్షి'కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన ఈ కాంపిటీషన్ మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఆంగ్లం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టేలా.. భాషపై పట్టుసాధించేలా కాంపిటీషన్ ఉందని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు.



కడప చిన్నచౌకులోని జీఆర్‌టీ జీవీకే పాఠశాలలో స్పెల్ 'బి' కాంపిటీషన్‌లో చిన్నారులు

క్లుప్తంగా

భార్య గొంతు కోసిన భర్త అరెస్ట్


ధనంజయ(ఫైల్)

మదనపల్లె : భార్య గొంతు కోసి హత్య చేసేందుకు ప్రయత్నించిన భర్తను గురువారం అరెస్ట్ చేశారు. తాలూకా ఎస్ఐ సుధాకర్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నివాసం ఉంటున్న గాజుల ధనంజయ(35) పోతబోలు జగనన్న లేఅవుట్‌లో ఇంటి నిర్మాణం చేస్తున్న భార్య గౌతమిని ఈ నెల 7వ తేదీన గొంతుకోసిన విషయం తెలిసిందే. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలతోనే హత్యాయత్నానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితుడిని ఇసుకనూతిపల్లె సమీపంలోని బైపాస్‌రోడ్డు టి-జంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టుకు హాజరు పరచి, రిమాండ్‌కు తరలించారు.

కారు, బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన రమణ

సిద్దవటం : మండల పరిధి ఉప్పరపల్లి గ్రామ సమీపంలోని సాయిబాబా గుడి వద్ద గురువారం కారు, బైక్ ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెనగలూరు మండలం తూర్పుపల్లి గ్రామానికి చెందిన పునగాని రమణ ద్విచక్ర వాహనంపై కడపకు వెళ్తుండగా.. కడప వైపు నుంచి చెన్నైకి కారు వెళ్తోంది. ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు ఉప్పరపల్లి సాయిబాబా గుడి వద్ద కు రాగానే ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రమణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడే ఉన్న వీఆర్‌ఏ వెంకటసుబ్బయ్య సంఘటనను పోలీసులు, రెవెన్యూ అధికారులకు తెలియజేశారు.

బైక్‌లు అదుపుతప్పి.. నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో గురువారం రెండు బైక్‌లు అదుపుతప్పి నలుగురు గాయపడ్డారు. పట్టణంలోని ఎగువకురవంకకు చెందిన ఉత్తన్న(38), తన భార్య ఆదెమ్మ(33), కుమారుడు మనోజ్(12)తో కలిసి తంబళ్లపల్లె మండలం గోపిదిన్నెకు వెళ్లాడు. తిరిగి ద్విచక్రవాహనంలో వస్తుండగా, మార్గంమధ్యలోని కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద వాహనం అదుపుతప్పి ముగ్గురూ కిందపడ్డారు. ప్రమాదంలో వారు గాయపడగా, స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కోళ్లబైలు పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన రమణ కుమారుడు శివ(29) వ్యక్తిగత పనులపై మదనపల్లె పట్టణంలోకి వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా.. మార్గంమధ్యలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బాధితులను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండల పరిధి పర్యాటక ప్రాంతమైన గండికోటలోని వాటర్‌ఫాల్స్‌లో బుధవారం గల్లంతైన ధనుష్ (17) అనే యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. బుధవారం అంతా గజ ఈతగాళ్లు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో మరుసటి రోజు గాలించగా మృతదేహం లభ్యమైంది. ధనుష్ ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీనివాసనగర్ ప్రాంతానికి చెందిన వాడు.

తెలుగు సాహిత్యానికి వెలుగునిచ్చిన బ్రౌన్

నేడు సి.పి.బ్రౌన్ 225వ జయంతి


సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం (ఇన్‌సెట్) బ్రౌన్ (ఊహా) చిత్రం

కడప కల్చరల్ : తెలుగు సాహిత్యానికి చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ మరింత వెలుగుతెచ్చారు. ఆయన తెలుగుజాతికి లభించిన ఓ వరం. శుక్రవారం బ్రౌన్ 225వ జయంతి సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం. సి.పి. బ్రౌన్ 1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించాడు. ఈయన తండ్రి డేవిడ్ బ్రౌన్ పేరొందిన విద్వాంసుడు. తండ్రి మరణించిన తరువాత బ్రౌన్ కుటుంబం ఇంగ్లండ్ వెళ్లింది. తండ్రి ఇచ్చిన స్ఫూర్తితో సీపీ బ్రౌన్.. గ్రీక్, లాటిన్, పారశీ, సంస్కృత భాషల్లో ఆరితేరాడు. అక్కడే హిందూస్థానీ భాష నేర్చుకున్నాడు. తరువాత 1817 ఆగస్టు 4న మద్రాసులో ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా మద్రాసులో కోదండరామ పంతులు వద్ద తెలుగులో ప్రాథమిక జ్ఞానం సంపాదించాడు.

సీపీ బ్రౌన్ పేరిట భాషా పరిశోధన కేంద్రం

1820 ఆగస్టులో కడప జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. 1824 నుంచి తెలుగు కావ్యాల అధ్యయనం ప్రారంభించి పట్టు సాధించారు. బదిలీ అనంతరం 1826లో కోర్టు రిజిస్ట్రార్‌గా మళ్లీ జిల్లాకు వచ్చారు. కడప నగరం ఎర్రముక్కపల్లెలో బంగళాను ఏర్పాటు చేసుకుని తెలుగుభాషోద్ధరణకు దాన్ని కార్యస్థానంగా మార్చారు. పలువురు పండితులకు జీతభత్యాలు ఇస్తూ తాను సేకరించిన గ్రంథాలకు శుద్ధ ప్రతులను రాయించారు. తాళపత్రాలలో శిథిలమవుతున్న ఎన్నో తెలుగు కావ్యాలను.. ఐజ్యపురం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పునరుద్ధరించారు. ఫ్రెంచ్ రచయిత 'అబె దుబయ్' ద్వారా బ్రౌన్.. వేమన, ఆయన పద్యాల ఘనతను తెలుసుకుని మక్కువ పెంచుకున్నాడు. వేమన పద్యాలున్న తాళపత్రాలను సేకరించి సొంత ఖర్చుతో ఆంగ్లంలోకి అనువదించారు. సీపీ బ్రౌన్ కార్యశాలగా నిలిచిన ఆ ప్రాంతం నేడు ఆయన స్మారకంగా మనం గర్వించదగిన గ్రంథాలయంగా రూపుదిద్దుకున్నది. తెలుగునాట ప్రతి భాషా ప్రియుడు గర్వంగా చెప్పుకోదగిన సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంగా పేరుపొందింది. లక్షకు పైగా వివిధ రంగాలకు చెందిన పుస్తకాలు, 200కు పైగా అపురూపమైన తాళపత్ర గ్రంథాలు, తామ్ర పత్రాలు, నాణేలు లాంటి పుష్కలమైన వారసత్వ సంపదకు నిలయంగా మారింది.

మానవతావాది

- బ్రౌన్ కడప నగరంలో రెండు, బందరులో రెండు, మద్రాసులోని ఎగ్మోర్‌లో ఒక పాఠశాల ఏర్పాటు చేశారు. తెలుగుతోపాటు ఉర్దూ, పార్శి నేర్పారు.
- మన జిల్లాలో ఓమారు 11 మంది దోషులకు 355 జరిమానా విధించగా తానే చెల్లించి వారిని విడుదల చేయించారు. ఒక ఉర్దూ మున్షి అప్పుల్లో ఉండగా రూ.1000 చెల్లించి రుణ విముక్తిని చేశాడు.
- కరువు సమయాల్లో గంజి కేంద్రాలను ఏర్పాటు చేశాడు. ఆయన గుంటూరుకు బదిలీ అయ్యాక ఇక్కడ కరువు వచ్చిందని తెలిసి.. తన సహాయకుడు కృష్ణారెడ్డికి గంజి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.
- వికలాంగులు, అంధులు, నిరుపేదలు, అనాథలు, వృద్ధులకు ధర్మ భోజనం పేరుతో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. పూటకూళ్ల సత్రాలకు ప్రతినెల తానే బిల్లు చెల్లించాడు.

మొండి గోడల నుంచి..

డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి.. ప్రముఖ రచయితలు బంగోరే, ఆరుద్రల సూచనల మేరకు బ్రౌన్ నివసించిన మేడ శిథిలాలు గల స్థానంలోనే బ్రౌన్ పేరిట స్మారక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అందుకే ఆయనకు బ్రౌన్‌శాస్త్రి అనే పేరు వచ్చింది. బ్రౌన్ గ్రంథాలయంలోని సమావేశ మందిరానికి బ్రౌన్ శాస్త్రి అని పేరు పెట్టారు. డాక్టర్ జానమద్ది తన మిత్రుడు మైనంపాటి సుబ్రమణ్యం ద్వారా బ్రౌన్ ఊహా చిత్రాన్ని రూపొందింపజేసి.. తెలుగు సాహితీ లోకానికి అపూర్వమైన కానుకగా అందజేశారు.

మరో భవనానికి ముఖ్యమంత్రి చర్యలు

మారుతున్న కాలానికి అనుగుణంగా బ్రౌన్ గ్రంథాలయాన్ని విస్తరించాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రౌన్ గ్రంథాలయాన్ని ఇటీవల సందర్శించినపుడు విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. విస్తరణకు రూ. 5 కోట్లు అవసరమవుతాయని తెలుపగా, ముఖ్యమంత్రి వెంటనే ఆ మొత్తాన్ని మంజూరు చేశారు. ఆ తర్వాత పెరిగిన సొమ్మును కూడా మంజూరు చేసి నూతన భవన నిర్మాణానికి మార్గం సుగమం చేయడంతో తెలుగుభాషా ప్రియులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి

– కలెక్టర్ గిరీషా పీఎస్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

రాయచోటిటౌన్ : జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో నిర్ణీత లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులకు ఆదేశించారు. విజయవాడ ఏపీ సచివాలయ సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రభుత్వ పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి గురువారం సమీక్షించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండో దశలో చేపట్టిన రీసర్వే పారదర్శకంగా పూర్తిచేయాలని సూచించారు. గ్రామాలలో గ్రోస్ప్లై, ఓఆర్ఐ, బౌండరీ కన్ఫర్మేషన్, గ్రౌండ్ వాల్యుయేషన్, సెక్షన్-13 నోటిఫికేషన్, హద్దురాళ్ల పాతడం వంటి విషయాలలో ప్రగతి సాధించాలని చెప్పారు. ఎంఎస్పీ గోదాములకు భూకేటాయింపు చేయాలని సూచించారు. రబీ సీజన్ సన్నద్ధతలో భాగంగా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గృహ నిర్మాణంలో జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


మృతి చెందిన విశ్వనాథరెడ్డి

సంబేపల్లె : జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. సంబేపల్లె మండలంలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై గుట్టపల్లి పంచాయతీ బట్టావాండ్లపల్లె క్రాస్ వద్ద గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. గాలివీడు మండలం గుండ్లచెరువు దుగ్గనపల్లెకు చెందిన కాలువపల్లె విశ్వనాథరెడ్డి (40) కొంత కాలంగా కడపలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆయన తన ద్విచక్ర వాహనంలో చిత్తూరు వైపు వెళ్తుండగా బట్టవాండ్లపల్లె క్రాస్ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి..

గాలివీడు : మండల పరిధి నూలివీడు బస్టాండులో బుధవారం రాత్రి ట్రాక్టర్‌పై నుంచి జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. నాగూరువాండ్లపల్లెకు చెందిన బాలాజీ (25) నూలివీడు బస్టాండు నుంచి స్వగృహానికి ట్రాక్టర్‌లో వెళ్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ వెంకటశివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక సర్పంచ్ ఉమాపతిరెడ్డి, ఎంపీటీసీ అమానుల్లా గురువారం మృతుడి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నాటుసారా, కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుకున్న మద్యం, నిందితులతో ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో గురువారం నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో.. అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం, నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీహరిరెడ్డి వివరాలు వెల్లడించారు. నిమ్మనపల్లె మండలం ముష్టూరు క్రాస్ వద్ద ఆటోలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యంతోపాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పుంగనూరుకు చెందిన ఆటోడ్రైవర్ మారప్పగారి సుబ్రహ్మణ్యం(30), వాల్మీకిపురానికి చెందిన సరఫరాదారు యడవల్లి మునిరెడ్డి(49)ను అరెస్ట్ చేసి, నిమ్మనపల్లెలో కర్ణాటక మద్యం అమ్మకాలు సాగించే చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేశారు. అలాగే మదనపల్లె మండలం దాదినాయనితండా నుంచి మదనపల్లెకు సారాను తరలిస్తున్న బుక్యా సురేష్‌నాయక్‌ను అరెస్ట్ చేసి, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాటుసారా అమ్మకాలు చేస్తున్న నడిమితండాకు చెందిన బుక్యా అనిత(48), బుక్యా సుజాత(30)పై కేసు నమోదు చేసి 10 లీటర్ల సారా స్వాధీనంతో పాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కోటవారిపల్లెకు చెందిన బుక్యా రవినాయక్ వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారా, దాని రవాణాకు వినియోగిస్తున్న ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నారమాకులతండాకు చెందిన దొరస్వామినాయక్(45) పట్టణంలోకి 60 లీటర్ల నాటుసారాను అక్రమంగా తరలిస్తుండగా, ద్విచక్రవాహనంతోపాటు స్వాధీన పరచుకుని కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్ నిమిత్తం మదనపల్లె మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా.. 14 రోజుల పాటు రిమాండ్ విధించారు.

మనసున్న మారాజు

- అడిగిన వెంటనే సాయం చేసిన సీఎం జగన్
- సీఎం సహాయ నిధి ద్వారా వైద్య సేవలు
- ముగ్గురు చిన్నారులకు రూ.లక్ష చొప్పున అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనసున్న మారాజు అని మరోమారు చాటుకున్నారు. రాయచోటిలో ముగ్గురు చిన్నారుల బాధను చూసి ఆయన చలించారు. వారికి వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రాయచోటి పర్యటన నిమిత్తం వచ్చారు. ఆయనకు ఆ చిన్నారుల తల్లిదండ్రులు తమ ఆవేదనను వెలిబుచ్చారు. సావధానంగా విన్న ముఖ్యమంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేయాలని అధికారులకు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు.. అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ముగ్గురు పిల్లల వైద్య చికిత్సకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చెక్కు అందజేశారు. ముఖ్యమంత్రి చేసిన సాయం ఎన్నడూ మరువలేమని పిల్లల తల్లిదండ్రులు తెలిపారు.

- లక్కిరెడ్డిపల్లె మండలం కెఎస్‌ఆర్.పల్లి గ్రామానికి చెందిన పది నెలల పాప నాగజ్యోతి తలసేమియా వ్యాధితో బాధపడుతోందని సీఎంకు పాప తల్లిదండ్రులు విన్నవించారు. సీఎం స్పందించి రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందేలా చూడాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను ఆదేశించారు.
- సంబేపల్లె మండలానికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు రాంప్రసాద్ (1 సంవత్సరం, రెండు నెలలు వయసు) హైడ్రో సెఫాలస్ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్సకు తగిన ఆర్థికస్తోమత లేదని తల్లిదండ్రులు చెప్పడంతో స్పందించిన సీఎం తగిన సాయం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.
- తన కుమారుడు శశాంక్ (6 ఏళ్ల వయసు) సెరిబ్రల్‌పాలసీ వ్యాధితో బాధపడుతున్నట్లు కలికిరి మండలానికి చెందిన భాగ్యలక్ష్మి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. శశాంక్ పుట్టిన ఏడాదికే మంచానికే పరిమితమయ్యాడని, రోజూ కూలిపని చేసుకొని జీవనం సాగించే తాము చికిత్స చేయించలేమని విన్నవించారు. సీఎం స్పందించి వ్యాధి చికిత్సకు తగిన ఆర్థిక, ఇతర సాయం అందించాలని కలెక్టర్ గిరీషా పీఎస్‌ను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ముగ్గురు పిల్లలకు లక్ష రూపాయల చొప్పున తక్షణసాయం కలెక్టర్ అందజేశారు.

క్రీడల్లో రాణించాలి

- రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట : క్రీడల్లో రాణించి రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేయాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. అంగళ్లలోని విశ్వం కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే 67వ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. క్రీడాకారులు మార్చ్ నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర స్థాయి పోటీలు నియోజకవర్గంలో నిర్వహించడం హర్షణీయమన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపే లక్ష్యంగా ఆడాలన్నారు. ఏ ఆటలోనైనా గెలుపోటములు సహజమన్నారు. ఓటమి ఎదురైతే దాని నుంచే గెలుపు పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలన్నారు. ప్రతిభ చూపిన వారికి ఉన్నత విద్య, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. సీఎం జగన్ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. విశ్వం విద్యా సంస్థల అధినేత ఎం.ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.దస్తగిరి, సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, మండల కన్వీనర్ కోళ్ల వాసుదేవరెడ్డి, సురేంద్రరెడ్డి, సాయికుమార్‌రెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

పీలేరు రూరల్ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని క్యాబినెట్‌లో ఆమోదించడంతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ.. ఆయన చిత్రపటానికి వారు పాలాభిషేకం చేశారు. గురువారం స్థానిక కోటపల్లెలోని గిరిజన గురుకుల పాఠశాలలో పీలేరు ప్రెస్‌క్లబ్ తరపున ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 40 మంది పదో తరగతి విద్యార్థినులకు విద్యా సామగ్రి తహసీల్దార్ ధనుంజయులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షులు ఖాదర్‌బాషా, గౌరవ సలహాదారులు పఠాన్ జాకీర్‌హుస్సేన్, అధ్యక్షులు ఎం.జాకీర్, చంద్రశేఖర్ రాజు, రామాంజులు, సుబ్రమణ్యం, అల్తాఫ్, రవి, రవికిషోర్, తిరుమల, హాఫీజుల్లా, శ్రీనివాసులునాయుడు, సురేంద్ర, బావాజి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలతో యువతకు ఉపాధి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపారు. గురువారం కడపలోని ఓ కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన పర్యటనలో భాగంగా కొప్పర్తి పారిశ్రామిక వాడలోని అల్ డిక్సన్ కంపెనీని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- విద్యార్థులకు పలు పోటీలు
- 20న బహుమతుల ప్రదానం

కడప కల్చరల్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఎప్పటిలాగా నవంబరు 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్.ఉషారాణి తెలిపారు. గురువారం ఆమె కడప నగరం కొండాయపల్లెలో విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించడం, వాటి అభివృద్ధికి ప్రజల సహకారం కోరడం, సంపూర్ణ అక్షరాస్యత గురించి వివరించడం, గ్రంథాలయాలలో సభ్యత్వం పెంచేందుకు చర్యలు చేపట్టడం తదితరాలతో ఈ వారం రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

- 14న కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేసి వారోత్సవాలను ప్రారంభిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు యూకేజీ నుంచి 5వ తరగతిలోపు విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రస్ పోటీ కొండాయపల్లెలోని తమ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు దేశభక్తి గీతాలాపన పోటీలు, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు విలువలతో కూడిన పాటల పోటీ ఉంటుందన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఈ విభాగంలో నలుగురిని మాత్రమే అనుమతిస్తామన్నారు.
- 15న ఉదయం 10 గంటలకు చదరంగం పోటీలు ఉంటాయని, 6, 7, 8 తరగతుల విద్యార్థులు జూనియర్స్‌గా, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్స్‌గా భావిస్తామని తెలిపారు. చెస్ బోర్డులను పోటీదారులే తెచ్చుకోవాలని, ఒక్కో విభాగానికి ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురిని మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. ఈ పోటీలు కడప నగరం అన్నమయ్య సర్కిల్‌లోని మున్సిపల్ మెయిన్ హైస్కూలులో నిర్వహిస్తామన్నారు. అదే రోజున ఉదయం 10.30 గంటలకు అదే వేదికలో వ్యాసరచన పోటీ ఉంటుందని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఆధునిక యుగంలో డిజిటల్ గ్రంథాలయాల పాత్ర అనే అంశంపైన, 8, 9, 10 తరగతుల విద్యార్థులు మానవతా విలువలు-మన బాధ్యత అనే అంశంపైన, 6, 7 తరగతుల విద్యార్థులు నేను చదివిన మంచి కథ అనే అంశంపైన మాట్లాడాల్సి ఉంటుందన్నారు.
- 16న ఉదయం 10 గంటలకు 7 నుంచి 10వ తరగతిలోపు విద్యార్థులకు ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా గురించిన ప్రశ్నలతో కూడిన క్విజ్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఒక్కో పాఠశాల నుంచి నలుగురు మాత్రమే పోటీలో పాల్గొనాలని, ఈ పోటీ కూడా మున్సిపల్ మెయిన్ హైస్కూలులోనే నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అక్కడే చిత్రలేఖన పోటీలు ఉంటాయని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు కూరగాయలు విక్రయించే వ్యక్తి అనే అంశంపైన, 8, 9, 10 తరగతుల విద్యార్థులు కుటుంబం అనే అంశంపైన, 6, 7 తరగతుల విద్యార్థులు మన జాతీయ పక్షి అనే అంశంపై చిత్రాలు గీయాల్సి ఉంటుందన్నారు.
- 17న ఉదయం 10 గంటలకు వక్తృత్వ పోటీలు ఉంటాయని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు నేను చదివిన మంచి పుస్తకం అనే అంశంపైన, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పుస్తకం-దాని విలువ అనే అంశంపైన, 6, 7 తరగతుల విద్యార్థులు గ్రంథాలయాలు-వాటి ఉపయోగాల గురించి ప్రసంగించాల్సి ఉంటుందన్నారు.

మంటగలసిన మానవత్వం

ఓ వృద్ధురాలిని వదిలేసి వెళ్లిన కుటుంబ సభ్యులు


బస్‌షెల్టర్‌లో ఉన్న వృద్ధురాలు

రాజంపేట టౌన్ : మానవత్వం మంటగలిసిన సంఘటన రాజంపేటలో గురువారం చోటు చేసుకుంది. ఓ వృద్ధురాలిని కుటుంబ సభ్యులు బస్‌సెల్టర్‌లో వదిలేసి వెళ్లడంతో.. ఆమె అష్టకష్టాలు పడుతోంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని పోలి ద్వారకానగర్‌కు చెందిన ఓ వయోవృద్ధురాలి కాలికి గాయం కావడంతో వైద్యులు రాడ్లు అమర్చారు. ఆమె నడవలేని పరిస్థితిలో మంచానికే పరిమితమైంది. ఆమెను చూసుకోవడం కుటుంబ సభ్యులకు.. భారం అనిపించిందో ఏమో కానీ.. రాజంపేట పట్టణం బైపాస్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరుపయోగంగా చెత్తాచెదారంతో ఉన్న బస్‌షెల్టర్‌లో వదిలి వెళ్లారు. ఆమె పడే బాధను చూడలేక అక్కడి ఆటో డ్రైవర్లు వివరాలు సేకరించి ద్వారకానగర్‌కు ఆటోలో తీసుకెళ్లారు. ఆ వృద్ధురాలిని, ఆమెను తీసుకొచ్చిన వారిని కుటుంబ సభ్యులు దూషించి.. తిరిగి బస్‌షెల్టర్‌లోనే వదిలి వెళ్లారు. సమీపంలో ఉన్న వారు మజ్జిగ, జ్యూస్ వంటివి తాపించే ప్రయత్నం చేస్తున్నప్పుడు.. ఆమె అయ్యా, అయ్యా అంటూ కేకలు పెడుతుండటం అక్కడి వారిని కలచి వేస్తోంది. ఆమె మాట్లాడలేని పరిస్థితిలో ఉండటంతో.. వివరాలు పూర్తి స్థాయిలో తెలియడం లేదు. పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకొని, ఆ వృద్ధురాలిని నరకయాతన నుంచి కాపాడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

శ్రీ వైజయంతిలో దీపావళి ఆఫర్లు


నరేష్‌కు రూ.5 లక్షల గృహోపకరణాలు అందజేస్తున్న కృష్ణాజీ, రామిరెడ్డి

నెల్లూరు(బృందావనం) : దీపావళి సందర్భంగా శ్రీవైజయంతి ఎలక్ట్రానిక్స్‌లో వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు అందజేస్తున్నట్లు ఆ షోరూం అధినేతలు ఎల్ నిరంజన్‌రెడ్డి, ఎల్‌టీ రామిరెడ్డి తెలిపారు. నెల్లూరులోని వై జయంతి ఎలక్ట్రానిక్స్‌లో ఎల్‌జీ కంపెనీ రిఫ్రిజిరేటర్ కొనుగోలు చేసిన కస్టమర్ నరేష్ రూ.5 లక్షల విలువైన గృహోపకరణాలను గెలుపొందారు. గురువారం షోరూమ్‌లో నరేష్‌కు ఎల్‌జీ కంపెనీ రీజినల్ మేనేజర్ కృష్ణాజీ, బ్రాంచి మేనేజర్ రామమనోహర్ గృహోపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి, రామిరెడ్డి మాట్లాడుతూ దీపావళి సందర్భంగా తమ షోరూంలో కస్టమర్లకు హ్యాట్రిక్ ఆఫర్‌కింద ప్రతి కొనుగోలుపై స్క్రాచ్ కార్డు ద్వారా రూ.10 వేల వరకు క్యాష్‌బ్యాక్, విలువైన బ్రాండెడ్ గృహోపకరణాలు అందజేస్తున్నామని తెలిపారు. బంపర్ లక్కీడ్రా ద్వారా బుల్లెట్, ఎలక్ట్రిక్ బైక్, ఐ ఫోన్ వంటి బహుమతులు అందజేస్తున్నామని వివరించారు. అన్ని ప్రముఖ కంపెనీల గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్లతోపాటు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు అందిస్తున్నామని తెలిపారు. బజాజ్, హెచ్‌డీబీఐ, ఐడీఎఫ్‌సీ వంటి ఫైనాన్స్ కంపెనీల ద్వారా ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా రూ.4 లక్షల వరకు వడ్డీలేని ఈఎంఐ ఫైనాన్స్ అందిస్తున్నామని వివరించారు. నెల్లూరు, కావలి, తిరుపతి, చిత్తూరు, మదనపల్లిలోని తమ షోరూమ్‌లలో ఈ ఆఫర్లు అందిస్తున్నామని తెలిపారు.